# విముక్తి

- శ్రీకంఠస్ఫూర్తి

(కథాపత్రికకు పంపిన కథలలోంచి మన మాసపత్రికలో ప్రచురణకు ఎంపికైన ఈ కథను మా పాఠకులకు ప్రత్యేకంగా అందిస్తున్నాం)



**మా**కు ఎదురుగా వున్న 'బి-సిక్స్' ఫ్లాటులో ఇద్దరు పోలీసులు... తెల్లని దుస్తుల్లో వున్న మరో ఇద్దరు ఆఫీసర్లు... వాళ్లముందు పైడితల్లి... ఏం జరుగుతోంది? ఆఫీసర్లు పైడితల్లిని ఏవో ప్రశ్నలు వేస్తున్నారు. ఆ పిల్ల భయంభయంగా జవాబులు చెబుతోంది.

వంటగదిలో వున్న శ్రీమతిని పిలిచి, ఆ దృశ్యం చూపించాను.

శ్రీమతి భారంగా ఓ నిట్టూర్పు విడిచింది. అంతకు మించిన గంభీరత ఆమె ముఖంలో చోటుచేసుకుంది.

. . . . .

పదిరోజుల క్రితం...

సాయంత్రం ఆరు గంటలు...

కాలేజీ నుంచి అప్పుడే వచ్చి శ్రీమతి ఇచ్చిన కాఫీ త్రాగుతూ సోఫాలో కూర్చున్నాను. తను కూడా కాఫీ తెచ్చుకుని త్రాగుతూ సోఫా చివరన కూర్చుంది.

'ఏవండీ! పాపం! పనిపిల్ల పైడితల్లి పెద్దపిల్లయ్యింది' ఏదో రహస్యం చెబుతున్నట్టుగా చిన్నగా అంది.

'పెద్దపిల్లంటే...?' శ్రీమతి ముఖంలోకి విస్మయంగా చూశాను.

'అదేనండీ... ఆ పిల్ల పెద్దమనిషయిందట.'

విషయం నాకు అర్థమైంది. పైడితల్లి నా కళ్లల్లో మెదిలింది.

'చూడు ప్రమీలా! పనిపిల్లయినా, ఇంట్లో పిల్లయినా వయసురీత్యా మార్పు సహజమే కదా!' సాలోచనగా అంటూ కాఫీ కప్పు టీపాయ్ మీద పెట్టాను.

'ఆ పిల్ల పెద్దమనిషవడం సరే... రక్తస్రావం ఎక్కువవుతోందట. పైడితల్లి ఒకటే ఏడుపు... ఏవిటా ఏడుపు అని విచారిస్తే... ఆవిడ... అదే, అనితాదేవి నవ్వుతూ అసలు సంగతి చెప్పింది. ఎంతకూ రక్తస్రావం తగ్గలేదట. ఏ కళనుందో... ఏమనుకుందో... వెంటనే ఆటోలో ఆ పిల్లని హాస్పిటల్‌కి తీసుకుపోయింది.'

'ఆవిడ కూడా నువ్వూ వెళ్లలేకపోయావా?' నేను యథాలాపంగా అన్నాను.

'వెళ్దామని తయారయ్యానండీ! ఆవిడ వద్దండీ అంటూ ఖరాఖండిగా చెప్పేసింది...'

'పోనీలే... వాళ్ల పనిపిల్ల... ఆ మాత్రం బాధ్యత వహించడం వాళ్లకు తెలియదా- ఏవిటి?' శ్రీమతిని సమాధానపరచబోయాను.

'తెలియదని కాదండీ! మనం రోజూ కళ్లారా చూస్తున్నాం కదా! ఆ పిల్లను చూస్తే జాలిగా అనిపించింది. మనస్సెందుకో కాసేపు విలవిలలాడింది. సర్లెండి! ఏం చేస్తాం? మీకు గీజర్ ఆన్ చేశాను. స్నానం చేద్దురుగానీ రండి!'

ఆవిడ హాల్లోంచి లోపలకు వెళ్లింది.

పైడితల్లి మాకు ఎదురుగా వున్న ఫ్లాట్‌లో పనిపిల్ల. కాస్త పచ్చగా, పొడవుగా ఉంటుంది. పొట్టి లంగా, జాకెట్టు... పసితనం వీడని గుండ్రటి ముఖం... అమాయకత్వం నిండిన కళ్లు... ఎప్పుడూ ఎక్కడో ఆలోచిస్తున్నట్టుగా ఉంటుంది. పది దాటి, పదకొండు ఏళ్ల వయసు ఉంటుందేమో... సంవత్సరం నిండిన పాపను చంకనేసుకుని అప్పుడప్పుడూ మా ఫ్లాట్‌కు వస్తుంది- అదీ వాళ్లింట్లో ఎవరూ లేనప్పుడు.

శ్రీమతి చొరవగా పలకరిస్తే పైడితల్లి పల్లెటూరి యాసతో మాటల్ని తడుముకుంటూ మాట్లాడుతుంది. ఆ పిల్ల మాటలు, మాండలికం మా ఆవిడకిష్టం. మాకు ఆడపిల్లలు లేకపోవడం... అబ్బాయి ఒక్కడే కావడం... శ్రీమతికి ఆడపిల్లల మీద సరదా, కోరిక తీరకపోవడం కూడా పైడితల్లి మీద ప్రత్యేక దృష్టి, శ్రద్ధ, అభిమానం చూపించడానికి కారణం ఏమో అనుకుంటాను. ఆ పిల్ల అలాగే మాలిమి అయింది.

పైడితల్లిది శ్రీకాకుళం జిల్లాలో ఏదో కుగ్రామం. అమ్మా నాన్నా లేరు. మామ్మ ఒక్కతే ఉంది. ఆ మామ్మకూ తినడానికి తిండి లేదు. ఏ పనీ చేయలేదు. ఆకలీ, దారిద్ర్యపు చెరల్లోంచి తప్పించుకోవడానికి తప్పని పరిస్థితుల్లో... ఆ ముసలమ్మ మనవరాలిని తీసుకువచ్చి, మా ఎదుటి ఫ్లాట్‌లో అప్పగించి వెళ్లింది. జీతం నెలనెలా తనకింత పంపించేలా ఏర్పాటు చేసుకుంది. పైడితల్లి పనిపిల్లగా అంత దూరం నుంచి ఈ ఊరు రావడానికి తెలిసిన బంధువుల ద్వారా బేరసారాలు జరిగాయి. ఈ విషయాలన్నీ మాకు పైడితల్లి మాటల్లోనూ, అప్పుడప్పుడూ చూడటానికి వచ్చే మామ్మ కబుర్లలోనూ తెలిసినవే.

మాది నగరానికి నడిబొడ్డున వున్న 'మానస' అపార్టుమెంటు. రెండవ అంతస్తులో మాకు ఎదురుగా వున్న ఫ్లాటులో వున్న ఆయన పేరు ప్రేమానందరావు. మునిసిపల్ కార్పోరేషన్‌లో మేనేజరు ఉద్యోగం. ఆ హోదా వల్లనో, ఏమో... ఒళ్లు విపరీతంగా పెరిగిపోయి, మెడమీద భుజాలు, బుగ్గలు కలిసిపోయి ఉబ్బసం రోగిలా

ఆయాస పడుతూండడం వల్లనో, ఏమో... ఎప్పుడూ ధుమధుమలాడుతుంటాడు. ఎప్పుడయినా మెట్లమీద కానీ, లిఫ్ట్‌లో కానీ ఎదురయినా కనీసం చిరునవ్వు కాదు కదా... ఆ కళ్లల్లో ఎదుటివాళ్ల మీద ఏదో అనుమానం తొంగిచూస్తుంటుంది. భార్య పేరు అనితాదేవి. సాంఘిక సంక్షేమ శాఖలో వార్డెను ఉద్యోగం. ఒకపూట ఉద్యోగం చేస్తుంది. రెండోపూట విధిగా ఇంట్లో ఉంటుంది. ఇంట్లో ఉన్నంతసేపూ ఆవిడ గొంతు ఖంగుమంటూ వినబడుతూనే ఉంటుంది.

కాలేజీకి దగ్గరగా ఉందని, మేమీ ఫ్లాటులోకి అద్దెకు దిగిన తరువాత, కొత్తలో శ్రీమతి వాళ్లింట్లోకి తరచుగా వెళ్లేది. ఆవిడ కూడా కలివిడిగా కబుర్లు చెప్పేది. వాళ్లింట్లో అన్నీ ఖరీదైన వస్తువులేననీ, బంగారపు నగలెన్నో చూపించిందనీ, పట్టు చీరలు కట్టుకోలేనన్ని ఉన్నాయనీ... అయినా, ఆ ఇంట్లో తీరూ–తెన్నూ, శుచీ–శుభ్రతా లేవనీ, సర్దుకోవడం చేతకాదో, వాళ్ల తీరే అంతో... అంటూ వార్తలు మోసుకొచ్చేది.

'ఇద్దరూ ఉద్యోగస్తులు మరి! ఇల్లు అలాగే ఉంటుంది. ఒకరు హాస్టల్ వార్డెను, మరొకరు నగరపాలక సంస్థలో మేనేజరు... ఆదాయానికేమీ లోటుండదు. వాళ్లతో మనల్ని ఏ రకంగా పోల్చుకోకు...' శ్రీమతికి నేను బదులు చెప్పేవాణ్ణి.

వాళ్లకు ఇద్దరు మగపిల్లలు... వీరేంద్ర, సురేంద్ర... మళ్లీ పదేళ్ల తరువాతేమో ఓ పసిపాప! ఆ పాపను ఎత్తుకోవడానికి, ఏడవకుండా ఆడించడానికి, అన్నం తినిపించడానికి, పాలుపట్టడానికి, మొత్తం అన్ని పనులకీ పైడితల్లి అనే ఓ పనిపిల్ల... మగపిల్లలిద్దరూ నల్లగా వున్నా, ఏళ్ల వ్యవధిలో పుట్టిన ఆ పసిపాప తెల్లగా, బొద్దుగా ఉంటుంది. పైడితల్లి చంకని వదిలిపెట్టదు. క్రిందకు దించాలన్నా, ఎవరి చేతుల్లోకి వెళ్లాలన్నా 'కేర్'మంటూ గుక్కపెట్టి ఏడుస్తుంది. ఈ విషయంలో శ్రీమతి కెప్పుడూ ఆశాభంగమే!

పసిపిల్ల ఏడుపు వినబడితే చాలు... అనితాదేవి గొంతు 'పైడీ' అంటూ ఆగ్రహంతో ఫ్లాట్‌లోంచి వినబడుతుంది. విరుచుకుపడుతుంది. పైడి పసిపిల్లను ఊరుకోబెడుతూ ఒక్క ఉరుకు తీస్తుంది. ఫ్లాట్‌లోకి వెళ్లిన తరువాత, పసిపిల్ల ఏడుపు ఆగిపోతుంది. పైడితల్లి కెవ్వుమన్న కేక చెవిన పడుతుంది. కాస్సేపటికి... ఏడుపు దిగమింగుకుంటూ పైడి వరండాలోకి వచ్చి ఓ మూల కూర్చుండిపోతుంది. రోజులో ఒకటి రెండుసార్లు అలవాటుగా మాకు కనిపించే దృశ్యం ఇది... తను లోపల ఎందుకలా కెవ్వుమంటూ అరుస్తుందో చాలాసార్లు పైడితల్లిని అడిగినా పెదవి విప్పలేదు. కొన్నాళ్ల తరువాత భయంగా సైగలు చేస్తూ చెప్పింది... మేమిద్దరం చకితులమయ్యాం... చలించిపోయాం!

అనితాదేవి పైడి పిక్కపట్టుకుని తొడపాశం పెడుతుందట!

'పైడితల్లి మీరంటే ఎందుకో మరీ బెదిరిపోతుంది. చిన్నపిల్ల... భయం చెప్పొచ్చుగానీ... కాస్త సున్నితంగా...' ఒకసారి మాటల్లో శ్రీమతి సూచనప్రాయంగా ఆవిడతో అంది.

'డెబ్బై మంది పిల్లల్ని 'డిసిప్లిన్'లో పెడుతున్నదాన్ని! ఈ జిడ్డు ముం..తో పని

---

# అన్వేషణ

దేన్నో వెతుక్కుంటూ
ఈ లోకంలోకి వస్తాడు మనిషి- కాని
తాను దేన్ని వెదకటానికొచ్చాడో మరచిపోయి
అది జ్ఞాపకం చేసుకోవటంలోనే
గడిపేస్తాడు జీవితాన్ని!
ఉన్నట్టుండి అతనికి జ్ఞాపకం వస్తుంది
తన అన్వేషణ దేనికోసమో-
అది ఇక్కడ లేదనీ తెలుస్తుంది
అంతే! వెంటనే సామాను సర్దేసి
వెళ్లిపోతాడు పైలోకాల్లో వెదకటానికి.

.....

"ఎవరి బట్టలో పొరపాటున వేసుకున్నట్టు
ఎవరి చెప్పులో పొరపాటున తొడుక్కున్నట్టు
ఎవరి జీవితమో గడుపుతున్నాను నేను."

– జానకీ జాని

---

చేయించుకోవడం నాకు తెలియదంటారా? దీనికి పని చేతకాదు... చురుకుతనం లేదు... ఏడుపుగొట్టు ముఖం... ఎక్కడ చతికిలపడితే అక్కడే! కదలదు... మీరెవరూ చెప్పనక్కర్లేదు! ఉచిత సలహాలు ఇవ్వనవసరమూ లేదు!' అంటూ ఎగిసిపడిందట.

శ్రీమతి మనసు నొచ్చుకుంది. ముఖం చిన్నబుచ్చుకుంది.

అనితాదేవి 'డిస్సిప్లీన్'కు అనుగుణంగా, ఆమె పెద్దకొడుకు వీరేంద్ర ఇంటర్ రెండుసార్లు తప్పాడు. వయసుకు మించిన శరీర దారుఢ్యం ఉంది. ఇంటర్ తప్పినా, హీరోహోండా బండి స్పీడుగా నడుపుతాడు. ఇంటర్‌లో మా గోపీ వాడి క్లాసుమేటు. వీరేంద్ర విషయాలు వాడు విపులంగా చెబుతుంటాడు. చదువు కంటే సినిమాలు, షికార్లమీదే ఆసక్తి ఎక్కువ. మిత్రులకు విలాసంగా ఖర్చులు పెడతాడు. వీరేంద్ర అడిగినదానికంటే ఎక్కువగా ఇచ్చి వాళ్లమ్మ గారాబం చేస్తుంది. నీకు 'డిస్సిప్లీన్' లేదురా అంటూ ఆమె ముద్దుముద్దుగా తిడుతుంది. వీరేంద్ర బబుల్‌గమ్ నములుతూ, కీచైన్ గాల్లో గిరగిరా తిప్పుతూ... ఒక యువ సినిమా నటుడ్ని అనుకరించి చూపుతాడు. ఆ తల్లి ఆనందంతో పొంగిపోతుంది.

రెండవ కుర్రాడు సురేంద్ర తొమ్మిదో తరగతి కాబోలు చదువుతున్నాడు. పనిపిల్ల పైడితల్లి మీద దాడి చేసేది ఆ కుర్రాడే! చీటికీమాటికీ- 'చెల్లిని సరిగ్గా ఎత్తుకోవే', 'చీపురుతో సరిగ్గా తుడవ్వే' అంటూ పైడి వీపుమీద ఫెడీఫెడీమని గుద్దుతుంటాడు. ఆ కుర్రాడు 'డబ్ల్యుడబ్ల్యుఎఫ్' ఫైటింగ్ ఛానల్ తప్ప మరొకటి చూడడట! పెద్ద కుర్రాడికి- 'ఎంటీవీ' మహా ఇష్టం. ఇద్దరు కుర్రాళ్లు ఇంటివద్ద వుంటే, టీవీ ముందు మహాయుద్ధమే!

తల్లిదండ్రులిద్దరూ ఇంట్లో వున్నా, లేకపోయినా... ఉదయం ఏడున్నర మొదలు... ఏ అర్ధరాత్రి వరకో హాల్లో ఆ టీవీ అలా గోలపెడుతూనే ఉంటుంది. పైగా విపరీతమైన సౌండు, శబ్దకాలుష్యం... అపార్టుమెంటులో అందరూ తలుపులు మూసుకుని ఉంటే... వాళ్ల తలుపులు మాత్రం- పగలూ రాత్రీ తెరిచే ఉంటాయి.

ఇక వారానికొకసారి కార్పోరేషను మేనేజరు ప్రేమానందరావు ఫ్రెండ్స్‌తో వరండాలో పార్టీ పెట్టుకుంటాడు. ఎవరెవరో పెద్దవాళ్లే హాజరవుతుంటారు. ఆ సమయానికి నేను ముందు గదిలో ఏ పుస్తకం చదువుకుంటూనో, పేపర్లు దిద్దుకుంటూనో ఉంటాను. గ్లాసుల గలగల... మందు వాసన అపార్టుమెంటంతా గుప్పుమంటుంది. నవ్వులు... జోకులు... డోకులు... ప్రేమానందం 'పైడీ' అంటూ అరుస్తాడు. ఏ కునుకుపాట్లు పడుతూనో ఆ పిల్ల వాళ్లకి గ్లాసులు, సోడాలు, తినుబండారాలు అందిస్తుంది. చీదరింపులు, ఛీత్కారాలు, తిట్లు- ఆ పిల్లను తాకుతుంటాయి. అవి అప్పుడప్పుడూ చెంపదెబ్బలుగా రూపాంతరం చెందుతుంటాయి. హృదయ విదారకమైన సంఘటనలు ఒకటా... రెండా...?

ఒకసారి పైడి పసిపిల్ల నెత్తుకుని మెట్లమీద జారిపడింది. పసిపిల్ల పొట్టనంటిపెట్టుకునే ఉంది. పైడి పాదం బెణికి వాచిపోయింది. పదిరోజులు కుంటుతూనే నడిచింది. అప్పుడూ వాళ్లు పట్టించుకున్న పుణ్యాన పోలేదు. మరోసారి చిన్న కుర్రాడు సురేంద్ర బంతి విసిరితే- పైడి కనురెప్పకు తగిలింది. కనుగుడ్డులోంచి రోజుల తరబడి నీరు కారుతుంటే, పొడిగుడ్డతో నోటి ఆవిరి ఒత్తుకునేది. వాటికంటే దారుణమైనది- పైడితల్లిని వదిలేసి వాళ్లంతా ఏదో ఊరు వెళ్లిపోయారు. ఊరు చివర, ఎక్కడో బంధువులింట్లో తిండి తినమని... ఫ్లాటు వరండాలో పడుకోమని పురమాయించి వెళ్లారు. రెండు రోజుల వరకూ మేమెవరమూ ఆ పిల్లను పట్టించుకోలేదు. అసలు వాళ్లు ఊరు వెళ్లిన విషయమే మాకు తెలియలేదు. మూడో రోజు- మధ్యాహ్నం... పైడి వరండాలో స్పృహతప్పి పడివుంటే... మా గోపీ చూసి- వాళ్లమ్మతో చెప్పాడు. ఆవిడ నీళ్లు చిలకరించి... లేపి... టీ త్రాగించి విషయం ఏమిటి? అని అడిగితే, రెండు రోజులుగా తిండి (తిన)లేదట. ప్రేమానందం బంధువుల అడ్రసు దొరకలేదట. ఎన్ని వీధులు తిరిగినా తెలియలేదట. ఊరంతా తిరిగి తిరిగి కడుపు కాల్చుకుని... కాళ్లు ముడుచుకుని పడుకునేదిట. మాకు నోట మాటలు రాలేదు... రెండు రోజులుగా పస్తు వున్న పైడికి మరో మూడు రోజుల వరకూ శ్రీమతి మానవత్వంతో అన్నం

పెట్టింది. వాళ్లు వచ్చిన తరువాత ఆ విషయం తెలిసి, రెండు రోజులుగా– ఎవర్నీ తిండి అడగని ఆ పిల్ల అభిమానాన్ని గుర్తించకపోగా, మా ఇంట్లో తిన్నందుకు... వాళ్ల బంధువుల ఇల్లు కనుక్కోలేకపోయినందుకు... తొడపాశం శిక్ష అమలు చేసిందట– అనితాదేవి... మనసు బాధగా మూలిగే దృశ్యాలెన్నో ఇలా దృగ్గోచరమవుతుంటాయి. వాళ్లలో మానవత్వం అన్నది ఉందా? అన్న సందేహం మా మనసుల్ని వికలం చేస్తుంటుంది...

'ఏవండీ! ఏం చేస్తున్నారు? నీళ్లు చల్లారిపోతున్నాయి. స్నానానికి రండి!'

శ్రీమతి పిలుస్తూ హాల్లోకి వచ్చి లైటు వేసింది. పైడితల్లి ఆలోచనల్లో పడి మునకలు వేస్తున్న నేను, ఉలిక్కిపడి స్నానానికి లేచాను.

ఆ పిల్ల పడే హింస కళ్లారా చూస్తూ ఏమీ చేయలేని స్థితి! ఎవరికీ ఫిర్యాదు చేయలేని పరిస్థితి! ప్రేమానందరావు ఆ ఫ్లాటుని సొంతంగా కొనుక్కున్నాడు. పలుకుబడి, హోదా ఉన్నవాడు. ఒక ప్రత్యేక కులానికి చెందినవాడు. అపార్టుమెంటులో నాలాగా అద్దెకున్న వాళ్లే ఎక్కువ. దాదాపు అందరూ 'చెడు చూడకు' అనే సూత్రంతో కళ్లు మూసుకుంటే, నేను మాత్రం ఆ చెడును చూస్తూ కళ్లు మూసుకుంటున్నాను.

ఆ మర్నాడు ఆదివారం! ఉదయం పది గంటలయింది!

కాఫీ, టిఫిన్ పూర్తిచేసి, కాలేజీలో రేపు నిర్వహించవలసిన పరీక్షకో ప్రశ్నాపత్రం తయారు చేస్తున్నాను. గోపీ తన ఫ్రెండు 'వంశీ'తో క్రికెట్ గ్రౌండుకు వెళ్లిపోయాడు. శ్రీమతి ఎదుటి ఫ్లాట్‌లోకి వెళ్లి వచ్చింది. ఉదయం నుంచీ ఆ ఫ్లాట్‌కి వెళ్లి వస్తూనే ఉంది. మరో గంట తర్వాత నా ముందు కుర్చీ లాక్కొని కూర్చుంది.

'ఏవండీ! మనుషులు ఎప్పుడూ ఒకేలా ఉండరు సుమండి!' ఉపోద్ఘాతంగా మొదలుపెట్టింది.

'ఎవరి గురించి నువ్వు మాట్లాడేది?' పేపరు, పెన్ను ప్రక్కన పెట్టాను.

'అదేనండీ! అనితాదేవి... ముగ్గురు బిడ్డల తల్లి కదా! మనసు పొరల్లో ఏ మూలనో మానవత్వం ఉండకుండా పోతుందా?'

'నువ్వు దేని గురించి చెబుతున్నావో కాస్త అర్థమయ్యేలా చెప్పు!'

'మీకు ఓ పట్టాన తలకెక్కదు. పైడితల్లి గురించండీ! ఆ పిల్ల పెద్దమనిషయిందనీ అనితాదేవి హాస్టలు నుంచి రాగానే... హాస్పిటల్‌కు తీసుకు వెళ్లిందనీ చెప్పాను కదా! ఏవో ఇంజక్షన్లు చేయించింది. మందులిప్పించింది. రక్తస్రావం తగ్గింది కానీ, ఆ పిల్ల ఏడుపు మాత్రం తగ్గలేదు...'

'చిన్న వయసు... చిన్నపిల్ల... పైగా రక్తస్రావం...' ఆంతర్యం అర్థమైంది.

'అనితాదేవి మాత్రం... ఆ పిల్లని ఏ పనీ చేయనివ్వకుండా ఓ మూల కూర్చోబెట్టింది. తలంటి స్నానం చేయించింది. కొత్త బట్టలు కట్టబెట్టింది. పళ్లు, ఫలహారాలు, స్వీట్లు ఆ పిల్ల ముందు పెట్టింది. నన్నేకాక క్రింద అంతస్తులోని మరో నలుగురు ఆడవాళ్లని పిలిచి... ఆ పిల్ల మీద అక్షింతలు వేయించింది. పనిపిల్ల మీద– ఆ మాత్రం శ్రద్ధ, ప్రేమ చూపించడం విశేషమే కదా! ఆవిడలో గొప్ప మార్పు వచ్చిందనిపించింది. అంతేకాదు...' శ్రీమతి ఆనందంగా చెప్పుకుంటూ పోతోంది. నాకు సంతోషంగా, తృప్తిగా అనిపించింది.

'పైడితల్లి దిక్కూ–మొక్కూ లేని పిల్ల... ఎక్కడో మామ్మ అనే జీవి వున్నా లేనట్టే... కట్టుబానిస కంటే అన్యాయంగా వాళ్లింట్లో పనిచేస్తోంది. కొట్టినా, తిట్టినా కిమ్మనదు... పెట్టినా, పెట్టకపోయినా 'ఆకలి' అని అడగదు... చదువు లేదు... లౌక్యం, లోకజ్ఞానం ఇంకా అలవడలేదు... స్వేచ్ఛగా తిరగాల్సిన వయసులో బాల్యం ఒక బందిఖానాగా మారిన పైడితల్లి వ్యక్తురాలవడం... ఆ ఇంటావిడ అనితాదేవి ఆ మాత్రం దయగా ఆ పిల్ల యెడల ప్రవర్తించడం... మానవత్వాన్ని బ్రతికించడమే! మంచితనాన్ని రక్షించడమే!'

నా మనసులోని భావాల్ని శ్రీమతితో పంచుకున్నాను.

పైడితల్లి నిజంగా అయిదారు రోజులు బయట కనబడలేదు... ఏ పనీ చేసినట్టు లేదు... ఆ ఫ్లాట్‌లోంచి ఎప్పుడూ వినబడే 'పైడీ... పైడీ...' అన్న కేకలు వినబడలేదు. ఆ మరుసటి రోజేమో– సంచీ చేత్తో పట్టుకుని బజారుకు బయలుదేరాను. మెట్లు దిగుతుంటే పైడి పసిపిల్లను ఎత్తుకుని

వరండాలో ప్రత్యక్షమయింది. చాలా బలహీనంగా, చిక్కిశల్యమయినట్లుగా కనిపించింది. ఆలోచనగా– నేను ముందుకు నడిచాను.

సుమారు గంటన్నర తరువాత కూరగాయల బజారు నుంచి తిరిగి వచ్చేసరికి– శ్రీమతి సోఫాలో చేరగిలపడి కూర్చుంది. ఆమె ముఖం కందగడ్డలా ఉంది.

'ఏవండీ! నిజంగా ఘోరమేనండీ! దారుణం సుమా!' శ్రీమతి ఆవేశంతో గొంతు విప్పింది. ఎందుకో ఆపాదమస్తకం ఆమె కంపిస్తున్నట్టుగా ఉంది.

'ఏం జరిగింది? ఎందుకలా ఉన్నావు నువ్వు? ఘోరం ఏమిటి?' నాలో తెలియని ఉద్విగ్నత చోటుచేసుకుంది.

'పైడితల్లి పెద్దమనిషి అవడం కాదట! ఆ పెద్ద కుర్రాడు వీరేంద్ర లేడూ! పైడికి టీవీ చూపించి, ఏవో కబుర్లు చెప్పి... ఇంట్లో ఎవరూ లేకపోవడం చూసి, తలుపులు మూసి... ఆ పిల్లమీద అఘాయిత్యం చేశాడట!'

నాకు ఒళ్లు గగుర్పొడిచినట్లయింది.

పదహారేళ్ల కుర్రాడు... పదేళ్లు నిండీనిండని ఓ పనిపిల్ల మీద అఘాయిత్యం? ఎంత హింసాత్మకం? పైడితల్లి ఆ హింసను ఎలా భరించిందో? ఎంత ఏడ్చిందో? ఎవరు బాధ్యులు దీనికి? ముమ్మాటికీ వీరేంద్ర తల్లిదండ్రులే! వాళ్లు– వీరేంద్రకిచ్చిన మితిమీరిన స్వేచ్ఛ... విచ్చలవిడితనం... పిచ్చి సినిమాలు... విషం కక్కే విదేశీ ఛానళ్లు... టీవీల ముందు గంటల తరబడి ఒంటరిగా వదిలేయడాలు... పర్యవసానం! ఎంతటి అకృత్యం...?'

'ఎవరికీ చెప్పొద్దన్నారట... నోరు విప్పొద్దని భయపెట్టారట... మీరలా బజారుకు వెళ్లగానే పైడి బెదురుగా లోపలికొచ్చింది... అప్పుడు వాళ్లింట్లో ఎవరూ లేరు...

'పైడీ! నీరసం తగ్గిందా? మీ మామ్మకు ఉత్తరం రాశారా... వాళ్లు? ఎప్పుడొస్తుంది మీ మామ్మ?' అంటూ ఆత్మీయంగా అడిగాను. చేతిలో ఓ బత్తాయిపండు తినమని పెట్టాను. పిచ్చిపిల్ల బావురుమంటూ ఏడ్చింది. ఆ కుర్రాడు తననేం చేశాడో... ఎలా చేశాడో... ఎలా తన నోరు నొక్కేశాడో... ఎంత నొప్పిచేసిందో... ఎంత రక్తం వచ్చిందో... ఆ రక్తం చూసి ఎంత భయం వేసిందో... అమాయకంగా వివరించి చెబుతుంటే నాకు ఏడుపొచ్చేసింది...' శ్రీమతి కళ్లల్లో కన్నీటి సముద్రాలు...!

'ఇంత దారుణం జరిగిన తరువాత కూడా మనం ప్రేక్షకుల్లా ఉండిపోతే– మనుషులం అనిపించుకోం! పైడి మామ్మకు ఉత్తరం రాయడమే కాదు– మండల రెవెన్యూ అధికారికి, బాలకార్మిక సంక్షేమ అధికారికి, వెట్టిచాకిరీ విముక్తి సంచాలకులకీ వెంటనే ఉత్తరాలు రాస్తాను!'

నేను ఉద్రేకంతో పేపరు, పెన్నూ తీశాను.

'మీరు రాయనవసరం లేదు...!'

నేను ఆశ్చర్యంగా ఆవిడ ముఖంలోకి చూశాను.

'ఆ పనేదో... అరగంట క్రితం నేనే చేశాను. పైడితల్లి ఏడుస్తూ తన మామ్మకు ఉత్తరం రాయమని బ్రతిమాలింది. మామ్మకు వెంటనే రమ్మని ఉత్తరం రాస్తూ– ఆ పిల్లపై జరిగిన హింసంతా అందరికీ తెలియపరిచాను. ఎందుకైనా మంచిదని కొన్ని కాగితాల మీద పైడితల్లి వేలిముద్రలు తీసుకున్నాను... చూద్దాం! ఏం జరుగుతుందో! ఎంత త్వరగా జరుగుతుందో!'

శ్రీమతి గొంతులో ఒక స్థిర నిశ్చయం... ఒక నిర్ణయం...! ఇంతకాలం... పైడితల్లి యెడల స్పందించలేని నా పిరికితనానికి... నాకే సిగ్గేసింది...!

. . . . .

ప్రస్తుతాన్ని వీక్షిస్తే...

ఎదురుగా 'బి–సిక్స్' ఫ్లాట్‌లో అధికారులు పైడితల్లిని ఎడంగా తీసుకువెళ్లి ప్రశ్నల మీద ప్రశ్నలు వేస్తున్నారు... పైడితల్లి ఏడుస్తూ, తల ఊపుతూ జవాబులిస్తోంది... జవాబులిస్తూ మా ఫ్లాట్‌వైపు చేయిపెట్టి చూపిస్తోంది... మేము చలించలేదు... జరిగింది చెప్పడానికి... ఏదైనా ఎదుర్కోవడానికి సంసిద్ధంగానే ఉన్నాం...! మాకు నయనానందకరమైన దృశ్యం... ప్రేమానందం తన భార్య, ఇద్దరు కొడుకులతో... పోలీసుల వెంట మెట్లు దిగుతూ నడుస్తున్నాడు... అధికారులు ఇద్దరిమధ్యా నిలబడి... పైడితల్లి ఆశగా మా ఫ్లాట్‌వైపు అడుగులు వేస్తోంది... పైడితల్లి కిక విముక్తి...! ○